# నెరుసు

'ఈసారికి ఎళ్ళమ్మీ.... ఇంటిమీన అప్పులన్నీ తీరాల్నా? ఆడు కాలేజీలో సదువుతూ వున్నాడా? అయ్య ఇంకేం పని సేయగల్దే... మతిలో ఇదంతా అనుకో. ఇంటి పెద్దబిడ్డవి. మగాని మాదిరిగా ఇల్లు ఆదుకొంటివి... ఈ ఏడాది నీది కాదనుకొంటివా ఇంక మనం వద్దున పడిపోతాం ఆలోసించమ్మా'. సారమ్మ గొంతు చెవులో వినిపించినట్లుంది. కరుణ కళ్ళు నీళ్ళ పొరలతో మసకలు కమ్మాయి.

'ఆలోచిస్తే చచ్చిపోతానమ్మా... ఒకటే చాకిరి... వాళ్ళు నన్ను అన్ని రకాలుగా వాడుకొంటారమ్మా... వట్టి బొచ్చెలు తోమి వంట వొండితే నాకు కష్టం కానేకాకపోను. కానీ ఇంకా హింసమ్మా... నావల్ల కావడం లేదు. ఇంకో పని చేసి డబ్బు సంపాదిస్తా కానీ ఇల్లా కాదు.'

కరుణ పైట కొంగుతో కళ్ళనీళ్ళు అద్దుకొంది.

'విమల సాయం చేస్తే బయటపడిపోవచ్చు. ఎంత కష్టమైనా... ఏవయినా సరే...ఎన్నిగంటల చాకిరయినా సరే....'

మెట్లెక్కబోతూ తలపైకెత్తి చూసింది కరుణ. పైన ఎక్కడో ఆరో అంతస్థు కనిపిస్తోంది. లిఫ్ట్‌లో ఎక్కుదామా అనిపించింది. నిముషంలో వెళ్ళిపోవచ్చు కాని వెళ్ళి మాత్రం చేసేదేముందీ? ఒక్క నిట్టూర్పు విడిచి కాళ్ళీడుస్తూ మెట్లెక్కడం మొదలుపెట్టింది కరుణకుమారి. కడుపునిండా అన్నం..... నీళ్ళు. నడుస్తుంటే కడుపులో ఏదో కదులుతున్నట్లు అనిపించింది. విమల ఆఫీస్‌కు వెళ్ళిపోగానే తను మొట్టమొదట చేసిన పని ఇంకాసిని బియ్యం కడిగి పొయ్యికి ఎక్కించడం. విమల తినేసి మిగిల్చిన కాస్త కూరా అన్నం, పచ్చడీ మజ్జిగతో పాటు తను వండిన బోలెడంత అన్నం తీరికగా పట్టించి, ఆవిడకు ఆనవాలు తెలీకుండా అవన్నీ తోవీ, బోర్లించి, స్నానం చేసి ఇల్లా వచ్చేసరికి ఈ వేళ. మళ్ళీ రాత్రికి విమల కొంచెం అన్నమే వండుతుంది. సరిగ్గా సరిపోదు, మళ్ళీ అడిగేందుకు వుండదు. ఆకలాకలితో నిద్ర రాదు. అప్పుడే నయం....

కరుణ మొహంలో ఒక నవ్వు వచ్చింది.

"ఫ్రిజ్ నిండా కిక్కిరిసిన మాంసం. బ్రెడ్ ముక్కల మధ్యన పెప్పర్ చల్లిన మాంసం ముక్కలు ఇరికించి, నోరు పెద్దగా తెరిచి దాన్ని కొరుక్కుతినే మియా మొహం

కదిలింది. తింటూ తింటూనే గడ్డ పైకి రాలిన పెప్పర్‌బ్రెడ్ తునకలు దులుపుకోకుండా తన చేయి పట్టి దగ్గరకు లాక్కోవడం. సెంట్‌వాసన, బీరు, రొట్టెలు, మాంసం కలగలసిన ఒకలాంటి వాసన ముక్కు చివర్నే ఉన్నాయనిపించింది."

"మళ్ళీ వెళతానా...మళ్ళీ వెళ్ళిపోక తప్పదా'

బుజానికి తగిలించుకున్న బాగ్ ఎంతో బరువుగా తోచింది. అందులో పాస్‌పోర్ట్, వీసా వీసెల కొద్దీ బరువుగా చేతులు లాగేస్తున్నట్లు అనిపించింది.

'ఓయ్ కరుణా'

కరుణ తలెత్తి చూసింది.

విమల ఫోటోగ్రాఫర్ రాజుతో కలిసి కిందకు వస్తోంది.

'కరుణా నీకు నూరేళ్ళోయ్. రాజూ, నేనూ నీకోసం గంట సేపటి నుంచి ఎదురుచూస్తున్నాం. ఇప్పుడే వస్తానంటివీ.... ఇంతసేపు ఎక్కడికిపోయావూ.'

మాట్లాడుతోనే దిగివస్తోంది విమల.

కరుణ ఆగిపోయింది.

'కరుణా పోయి సోఫాలో కూర్చో. కాస్త టీ తాగి వస్తాం. నీ ఫోటోలు తీయాలి. ఈలోగా కాస్త రిలాక్స్ అవు'

కరుణ తలవూపింది.

పై అంతస్తులోనే ఉంది ఆఫీస్. తలుపు నెడుతోనే చల్లగా అనిపించింది. సెంట్రల్ ఎ.సి.లోపల చుట్టూ కాబిన్‌లలో ఎడిటర్, మార్కెటింగ్ మేనేజర్ ఇంకా ఎవరెవరో. హాల్లో సోఫాలో మూలగా కూర్చొంది కరుణ.

తానెందుకు ఆటో ఎక్కినా, బస్ ఎక్కినా ఒక మూలకి కూర్చుంటుందో అర్థం కాదు. ఈ సైకాలజీ ఏమిటో విమలని అడగాలి అనుకుంది కరుణ.

ఎడిటర్ అని రాసి వున్న తలుపు నెట్టుకొని ప్రభాకర్‌గారు బయటికి వచ్చారు.

'హౌ ఆర్ యూ కరుణా. నీపైన భలే ఆర్టికల్ రాసింది విమల. స్పెషల్ స్టోరీ. కవర్‌పైన నీ ఫోటో వేస్తోందిట'. సెన్సేషన్ అయ్యావే అన్నాడు నవ్వుతూ దగ్గరకు వచ్చి. ఆయన మాటాడుతున్నా తనని తల దగ్గర నుంచి గోరు వరకూ పరీక్షగా చూస్తున్నారనిపించింది.

ఏం చూస్తున్నాడు? ఆయన చేతిలో పేపర్లు చూశాక గుండె జల్లుమంది కరుణకి. 'అవన్నీ విమల ఈయన చేతికి ఇచ్చిందా?'

ఒక సన్నని మంట ఏదో కాళ్ళనుంచి పైపైకి పాకినట్లు వుంది.

'రాత్రి తనను అడిగిన ప్రశ్నలు ఎలాటివి! తను నమ్మి మనసు పరిచినదంతా ఇక్కడ ఇలా...'

'నీకేవని అనిపిస్తుందో సరిగ్గా చెప్పు.'

'ఏవనిపిస్తుంది విమలా వళ్ళు జలదరించింది.'

'ఏమిటీ జలదరించటమే' విమల నవ్వింది.

'అప్పుడేం చేశాడు'

తన కళ్ళలో నీళ్ళు చూసి విమల చప్పున తన దగ్గరకు వచ్చి కూర్చుంది. తన చేయి ఆమె చేతుల్లోకి తీసుకొంటే కన్నీళ్ళు పొంగి వచ్చాయి. ఒక ఆత్మీయ స్పర్శలో తను కరిగి వర్షించిన క్షణాలు అవి. ఎన్ని చెప్పినా, ఎంతగా చెప్పినా తన బాధ తీరలేదనిపించింది.

'చాలా ఎత్తుగా, లావుగా వుంటాడు విమ్మీ. తెల్లగా వుంటాడు. అందంగా వుంటాడు. అయితే నా పట్ల ప్రేమలేని కళ్ళు, మోహం నిండిన కళ్ళు. నాకేం వుంటుంది చెప్పు అక్కడ. నేను పనిమనిషినని తెలిసిన చేతులు' రొట్టె మాంసం తింటే కడుపు నిండిపోయినట్లు ఆడదాన్ని కూడా దగ్గరకు లాక్కుంటే ఆ ఒక్క అవసరం తీరిపోతుంది. అంతకంటే అక్కడ ఇంకేం లేదు. ఆ మాంసం నమిలిన నోరు, గడ్డం, శరీరం, పొట్ట అంతబలం ఒక్కటే నాకు అనుభవంలోకి వచ్చిన విషయం. అతనెంత బలవంతుడంటే అతను నాతో ఉండేది ఒకటో రెండో నిమిషాలు అంతే. అయినా నేనెందుకో అణిగిపోయేదాన్ని, నలిగిపోయేదాన్ని, నా శక్తి పూర్తిగా అయిపోయేది. నేను లేచి కూర్చోలేకపోయేదాన్ని, అతని భార్యకి ఇదంతా తెలుసు. ఆవిడ ఏం అనుకోదు, వద్దనీ అనదు. నాపై కోపం లేదు. పోనీ ఇష్టం, అసహ్యంలాటి అనుభూతులు లేవు. అతని దగ్గర నుంచి లేచి బయటికి వచ్చి ఆవిడ ఎదురుగా నిలబడ్డాననుకో. వచ్చావా.... ఆ గిన్నె ఇలా తీసుకురా అన్న మామూలు పురమాయింపుతో ఆవిడ నన్ను మనిషిని చేసేసేది. నాకూ అదే కావాలి. శరీరంపైన తప్ప ఆ జ్ఞాపకాలు ఎక్కడా నాకూ లేవు. ఒక్కసారయితే ఒక చుట్టాలతను, ఆయన స్నేహితుడు నాతో ఉన్నాడు. పెద్ద తేడా ఏం అనిపించలేదు. అయితే ఎవరూ నన్ను మళ్ళీ పలకరించి ముద్దులాడలేదు తెలుసా. విమల కుతూహలంగా వింటూ వుంది. 'పదిసార్లయినా అబార్షన్ అయింది'. విమల తలెత్తి చూసింది కరుణ వైపు.

"మరి నీకు ఏం అనిపించలేదంటావే.... కడుపు దాకా వచ్చీ....."

అదేమిటి విమలా.... ఇందాక నువ్వు అడిగింది వేరే ప్రశ్న. దానికీ ఈ ప్రశ్నకీ సంబంధం లేదు. ఆ సంబంధానికి నేను స్పందించలేదు. ఇది శరీరం కనుక

రెస్పాన్స్ ఇచ్చి తీరుతుంది. దానికి మనసుతో పనేముంది. అంత బలంగా వున్న మనిషి సర్వశక్తులతో నాతో ఆడుకొంటుంటే ఏం అనిపించదా. అది శరీరం ఇచ్చే ప్రతిచర్య మాత్రమే. నేను ఆనందించి సంతోషించి రెస్పాండ్ అవటం కాదు.

"ఏవో నాకయితే అలా కాదు. అసహ్యంతో వళ్ళు జలదరించదా రోతగా ఉండదా?" అంది విమల.

విమల మొహం వంక ఆశ్చర్యంగా చూసింది కరుణ.

'వాటికి అవకాశం ఎక్కడమ్మా విమలా. వాళ్ళింట్లో నేను పనిమనిషిని. నాకు నెలకు ఆరు వేలు జీతం. అదంతా ఇంటికి పంపేదాన్ని. ఫోన్‌లో మాట్లాడాలంటే ఆవిడ దయ, ఆయన ఔదార్యం నా పట్ల ఉండాలి. రెండు రోజులకొకసారి ఆయన నా దగ్గరకు వస్తే ఆ వేళకు నేను ఫోన్ చేసుకోనా అని అడిగేదాన్ని. తల వూపేవాడు. అలా అడగటం కోసం నన్ను నేను సిద్ధం చేసుకొనేదాన్ని తెలుసా.'

'ఏమిటీ ఆలోచనల్లోకి అలా జారిపోయారు. ఎక్కడ తేలారు' పెద్దగా నవ్వుతూ అన్నాడు ప్రభాకర్.

విమల ఎలా తెలుసు?

మావూరిలో నా దోస్త్. కలిసే డిగ్రీ వరకూ చదివేం.

మరి ఈ పాచి పనేమిటి?

ఉద్యోగం దొరకలేదు. మా అత్త సుజ్ఞానకుమారి అక్కడే వుంది. ఆవిడ పాస్‌పోర్ట్, టిక్కెట్ పంపింది. వెళ్ళక తప్పలేదు. మా వాళ్ళంతా అక్కడే వున్నారు.

ఆడవాళ్ళకి అక్కడ వాతావరణం బావుండదని మీ వాళ్ళకి తెలుసా?

కరుణ తలవూపింది.

'తెలుసు...' చెప్పారు.

'ఎవరికీ?'

నాకూ, అమ్మకీ, నాన్నకీ

అయినా వెళ్ళేవా?

వెళ్ళేముందే బాంబేలో నాలుగు రోజులు వుంచారని చెప్పావుట....

తల వూపింది కరుణ.

అప్పుడూ ఇంతేనా

అంతే.... బ్రోకర్‌తో సహా అందరూ వాడుకొంటారు.

ఆయన మొహంలో దయ చూసి మళ్ళీ కళ్ళనీళ్ళు రాబోయాయి.

'ఏయ్ కరుణా' విమల వచ్చింది.

ప్రభాకర్ తన చేతిలో పేపర్లు విమల చేతికి ఇచ్చాడు.

'ఐటమ్ గురించి ఫస్ట్ పేజీ బాక్స్ వేయించు విమ్లా.' అన్నాడు ప్రభాకర్. కళ్ళతోనే వెళతానన్నట్లు చెప్పేసి ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు.

ఏమిటే విమలా ఇదంతా ఇలాగే వేస్తున్నావా?

కంగారుగా అన్నది కరుణ.

'అబ్బో.... నువ్వు ఈ వారం సెన్సేషనోయ్. కంపోజింగ్ కూడా అయిపోతే.... అందరూ ఎగబడి చదివేరు.'

కరుణ చుట్టూ చూసింది. అద్దాల గదుల్లోంచి ఎందరో తనవైపు చూస్తున్నట్లు అనిపించింది.

ఫోటోగ్రాఫర్ రాజు ఫోటోలు తీస్తున్నాడు.

'క్లోజప్ తీయి రాజూ కవర్ పేజీ కోసం తన ప్రొఫైల్ మొత్తం రావాలి. తను మంచి ఫోటోజెనిక్.

విమల చెబుతోంది.

రాజు మొహంలో ఒక కుతూహలం కనిపించింది కరుణకు. 'ఇప్పుడు ఏం అనేందుకు లేదు... ముందే చెప్పింది విమల. నీ స్టోరీ చేస్తానే కరుణా. కొంతమందికైనా జ్ఞానం వస్తుందేమో అన్నది.... తను ఉద్రేకంలో ఉంది. విమల అడిగిన ప్రశ్నలకు మనసు కరిగి ప్రవహించి సమాధానాలు చెప్పింది కానీ జర్నలిస్ట్ విమల తనను ఇంటర్వ్యూ చేస్తున్నదని మరిచిపోయింది.

'నిన్ను సార్ రమ్మన్నారోయ్' అన్నది విమల.

'అడిగేవా ఉద్యోగం' చివరికి స్వీపర్ పనయినా పర్లేదోయ్ 'ఎన్నాళ్ళు నీ రూమ్‌లో తలదాచుకోనూ?'

'పోన్లే రెండు రోజులుంటే గానీ, స్టోరీ చేద్దామనుకొన్నాను గదా' నాకూ ఇబ్బందేనోయ్. పైగా నేను నాలుగేళ్ళబట్టీ ఒక్కదాన్నే ఉంటాను గదా. ఇంకెవరితోనైనా షేర్ చేసుకోవాలంటే నాకు భలే చావు.

విమల తన చేతిలో పెట్టిన డమ్మీవైపు దీక్షగా చూడటం మొదలు పెట్టింది కరుణ.

అక్షరాలన్నీ అలుక్కుపోయినట్లు అనిపించింది కరుణకు.

'రేపు ఊరెళతావా?' సార్ మళ్ళీ కబురు చేస్తానన్నారు.

'విమలా' అన్నది గాబరాగా కరుణ.

అబ్బా... కాసేపు ఈ ఐటమ్ సంగతి చూడనివ్వు కరుణా. సార్ మనకి ఇవ్వాళ తాజ్‌లో పార్టీ ఇస్తానన్నాడు.

ఏం పార్టీలేవోయ్. ముందు ఉద్యోగం సంగతి అడుగుతా!

నీ చేతిలోనే పాస్‌పోర్ట్, నీ విమానం టిక్కెట్లు రెడీగా ఉంటే అంతకంటే మంచి ఉద్యోగాలు ఇక్కడ మటుకు ఏం వున్నాయి.

'నువ్వూ ఇలాగే అంటున్నావా విమలా?'

పెన్ను కింద పడేసి వెనక్కి వాలి కూర్చొంది విమల.

'కరుణా, నేను నువ్వు అనుకొన్న విమలను కాదు. ఇప్పటి విమల నువ్వు ఎరిగిన విమల కాదు. ముందు ఈ విషయం తెలుసుకొంటే అన్ని సంగతులు స్పష్టంగా అర్థం అవుతాయి. నిన్ను రిసీవ్ చేసుకోను రెండ్రోజులు లీవ్ పెట్టాను చూడూ, ఎడిటర్ దృష్టికి వెళ్ళింది ఇష్యూ. హ్యూమన్ ఇంట్రెస్టూ, గాడిద గుడ్డూ.... కబుర్లన్నీ చెప్పి, ఇదంతా కలిసి ఒక ఆడదాన్ని స్పూన్‌తో ఎలా తిన్నారో అదొక కవర్‌స్టోరీ... ఒక మనిషి హింస, ఏడుపు, భయం, ఆరాటం ఒక పత్రికకు సెన్సేషనల్ ఐటమ్.'

పకపకమని నవ్వింది విమల.

కరుణ కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది.

'అవేం కళ్ళే.... అంతలేసి కళ్ళతో అలా జాలిజాలిగా చూసినా ఎవరికేం జాల్లేదే. నువ్వు పైసలకు దొరుకుతావేమోనని తెలిసీ నిన్ను చూసే చూపులున్నాయి. చూడు వీళ్ళనే... ఎవడి మొహంలో నైనా ఓ స్పూన్ దయ వుందేమో.

ఒక్క నిముషం ఆగింది విమల. అనుమానంగా కరుణ వైపు చూసింది.

'ఇంత దిగులున్న దానివి నువ్వు. ఈ ఐటమ్ చేయకుండా వుండచ్చు కదా అనచ్చు. నెవ్వర్.... నా ఉద్యోగం నిముషంలో ఊడిపోతుంది. నాపైన బాస్ ఇంప్రెషన్ పోతుంది. ఆయన నీ ఐటమ్ బ్రహ్మాండం అని చెప్పగానే నేను ఇంప్రెస్ అయిపోయి మెలికలు తిరగకపోతే ఇక వాడు నన్ను రాచి రంపాన పెడతాడు. సెలవుకోసం నీ గురించి రెండు ముక్కలు చెప్పానే బాబూ అదింత పని చేసింది. నీ దోస్తీ, నీ బతుకు న్యూస్ ఐటమ్ చేసేసింది. ఇదంతా నాకోసమేనే బాబూ. మా ఎడిటర్ దట్ జంటిల్‌మాన్. ఆయన మాటకు తందానతాన అనకపోతే ఇక నా ఐటమ్స్ ఆయనకు ఎప్పుడూ నచ్చనే నచ్చవు. నా పెర్‌ఫార్మెన్స్ బాలేదని, నేను ఇన్‌ఛార్జిగా పనికి రాననీ ఎం.డి.తో చెవిలో ఇల్లు కట్టుకొని చెప్తాడు. మన పని అవుట్. జర్నలిజం ఏం ఊడబొడిచిందనీ.... గుమస్తాకంటే కాస్త అటూ ఇటూ. ఇక్కడ బాస్‌లు, ఆశ్రితజనులూ సొంత లాబీలు, లాభాలు, ఇదో మొసళ్ళకోన. ఇక్కడ నిలదొక్కుకోవాలంటే జలజంతువులతో సావాసం తప్పదే.'

'విమ్లా భయంగా వుందే.'

'భయమా' విరగబడి నవ్వింది విమల.

నువ్వు నన్ను నమ్మావు కదే. ఇంతకంటే భయపడే వ్యవహారం ఇంకేం వుంటుందీ. ఇందాక నిన్ను బాస్‌తో కారెక్కించానా, ఆయన పక్క నువ్వే కూర్చున్నావు. నేను మడి గట్టుకొని వెనక జేరా. ఆయన్ను తగులుకుంటూ నువ్వు కూర్చుంటే ఆ స్పర్శానందంలో ఆయన మనకు బిర్యానీ తినిపించారా? సాయంత్రం వేళ స్పెషల్ ఇన్విటేషన్‌తో సంగీత విభావరి వినిపించాడా. ఈలోగా ఎయిడ్స్ గురించి వందసార్లు మాట్లాడాడు. నిన్ను చూస్తే ఎయిడ్స్ భయం పుట్టివుంటుంది. లేకపోతే నిన్ను వదలకపోను. ఉసే కరుణా... భయం నీ ముందర్నే వుందే... నువ్వు నన్ను చూసి భయపడితే ఎంతయినా ఉచితంగా వుంటుంది. ఏడవటం ఎందుకో నాకు అసహ్యం. ఎంత బాధేసినా ఏడవకే కరుణా... నాకు నచ్చదూ.

వెనక్కి వాలి పడుకొని ఆ అమ్మాయి వైపు చూసింది కరుణ.

'నేన చెడిపోయానని నీకు అసహ్యం వేసిందా?'

విమల ఆ అమ్మాయి చేతులు తన చేతుల్లోకి తీసుకొంది. ' ఇది వ్యాపార ప్రపంచం ఇందులో మనుష్యులే వస్తువులు' అమ్మకపు విలువ వుంటే చెల్లుతాం. ప్రేమ, అనుబంధం, చెత్తా, చెదారం ఏనాడో చిమ్మి పారేశాం. ఇక్కడ డబ్బు చెట్ల విత్తనాలు మాత్రం నాటేం. అవి మొలిచేందుకు మానవస్పర్శ, గాలీ, నీళ్ళూ అవసరమే లేదు. తెలివితేటలు పోస్తే చాలే. అవతల వాడ్ని తొక్కిపెట్టి ఉంచగల సత్తా వుంటే చాలు కరుణా.

కరుణ... మాట్లాడలేదు.

'ఏం ఆలోచిస్తున్నావ్ కరుణమ్మా.'

కువైట్ నుంచి నీకేం కావాలే విమ్లా!!

నువ్వేం తెచ్చుకొంటావో చెప్పు.

ఒక రెండేళ్ళు పనిచేసి, అప్పులు తీరుస్తా, ఇంకో రెండేళ్ళు పనిచేసి మొగుడ్ని కొనుక్కొంటా! బోలెడన్ని సెంట్లు కొనుక్కొంటా.

నాకూ సెంట్లే కావాలే కరుణా. నేను పెద్ద దుర్గంధాన్ని.

'అంత మాటెందుకే విమలా. ఈ సుడిగాల్లో మన బతుకులంతేనే... పోనీ నీకూ ఓ మొగుడ్ని కొనేయనా?'

ఇల్లంతా నవ్వులు.. కన్నీళ్ళు దాచుకొన్న నవ్వులు!! ☼

*'అభిమాన స్నేహాంజలి' నవంబర్ 2002*